క్లుప్తంగా

డంపింగ్ యార్డ్‌ను మార్చాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజల ఆరోగ్యాలకు హానికరంగా ఉన్న ఉక్కాయిపల్లి డంపింగ్ యార్డ్‌ను మార్చాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఉక్కాయ పల్లి డంపింగ్ యార్డ్‌ను డీవైఎఫ్‌ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఉక్కాయ పల్లి డంపింగ్ యాడ్ ను అభివృద్ధి పేరుతో పార్కును ఏర్పాటు చేశారన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే పక్కనే మళ్లీ డంపింగ్ యార్డ్ ను పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఉక్కాయ పల్లి, కొండాయపల్లి, శంకరాపురం, మాసాపేట ప్రాంతాల ప్రజలు పార్కుకు వస్తే ముక్కు మూసుకొని చివరివరకు వాకింగ్ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో పరిశ్రమ కోసం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడం కోసం, రేపటి భవిష్యత్ మార్చడం కోసం నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర మాట్లాడారు. ఈ బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో చేపట్టిన రోడ్ల విస్తరణ కు సంబంధించిన పలు సమస్యలను నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల విస్తరణ చేపట్టిన ప్రాంతాల్లో జరుగుతున్న పనులలో భాగంగా శిధిలాలను వెంటనే తొలగించాలని కోరారు. అలాగే కాగితాల పెంటలో ఉన్న రసూల్ షావలి దర్గా కు అనుసంధానంగా ఉన్న రూమును తొలగించ రాదని కోరారు.

కరువు మండలాలు ప్రకటించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయని, ప్రభుత్వం ఒక కమిటీ వేసి నివేదిక తయారు చేసుకుని నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి, కరువు మండలాలుగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే సామాజిక న్యాయం చేయగలదన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణుప్రీతమ్ రెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల తనిఖీ



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీఈ, హైపవర్ కమిటీ సభ్యులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య వై. సుబ్బరాయుడు, డా. వి.వెంకట్రామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడప నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 6న ప్రారంభమైన బీఎడ్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,963 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నగర క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 67వ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కడప నగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 4,5 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్–17 బాలబాలికల పోటీల్లో కడప నగరం నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థిని ఎం. సుహిత షారోన్, శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి అడ్రినో జార్జి చక్కటి ప్రతిభ కనబరిచారు. దీంతో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ ఫుట్‌బాల్ జట్లకు వీరిని ఎంపిక చేశారు. బాలుర విభాగం పోటీలు అండమాన్ నికోమార్‌లోను, బాలికల విభాగం పోటీలు పాట్నాలో నిర్వహించనున్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ. 1.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించడానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి బుధవారం హాజరు కానున్నారని మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప రోడ్డు వైపు నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో 16 గదులున్నాయని, వాటిని అతిథులు ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కడప అభివృద్ధి సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక 50వ డివిజన్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ హయాంలో కడప నగరంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రాష్ట్రంలో ఈ జిల్లా ఒకటుందని కూడా గుర్తించలేదన్నారు. ఒక్క పైసా నిధులు విదిల్చకుండా అన్యాయం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అయితే స్థానిక ఎమ్మెల్యేకు కూడా అభివృద్ధి నిధులు ఇవ్వకుండా ఓడిపోయిన టీడీపీ నేతలకు నిధులిచ్చి దోచిపెట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నగరంలో రైల్వేస్టేషన్ రోడ్డు, కలెక్టరేట్– రిమ్స్, రాజీవ్ మార్గ్ రోడ్లు అందంగా రూపుదిద్దుకున్నాయన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్, గోకుల్ లాడ్జి– అన్నమయ్య సర్కిల్, క్రిష్టా సర్కిల్– దేవునికడప, మాసాపేట– మాచుపల్లి రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయన్నారు. ఇవిగాక 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా ప్రతి డివిజన్‌లో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపా రు. జిల్లా ప్రజలు జగనన్నను మళ్లీ సీఎం చేసేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, పాలెం పల్లె రమణ, ఆడిటర్ మల్లి, ప్రసాద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

మొదలైన దీపావళి సందడి

– రెండు చోట్ల ఏర్పాటవుతున్న దుకాణాలు

– 80 దుకాణాల ఏర్పాటుకు అనుమతులు

కడప కల్చరల్ : కడప నగరంలో దీపావళి పండుగ సందడి మొదలైంది. పండుగకు కేవలం మూడు రోజులే గడువు ఉండడంతో టపాసుల దుకాణాలను ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా కాల్చే టపాసుల కోసం నగరంలో ప్రత్యేకంగా రెండు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పుడూ దుకాణాలు ఏర్పాటు చేసే మున్సిపల్ మైదానంలో ప్రస్తుతం ఎగ్జిబిషన్ జరుగుతుండడంతో ప్రస్తుతం నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలోనూ, బిల్టప్ వద్దగల మైదానంలోనూ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒకచోట 50, మరోచోట 30 స్టాల్స్‌ను ఏర్పాటుకు అధికారులు అనుమతించినట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నానికి దుకాణాలు ఏర్పాటై స్టాక్ తెచ్చిపెట్టుకుని విక్రయాలకు సిద్ధం చేసుకునేందుకు యజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎప్పటిలా దుకాణదారులు అధికారుల సూచన మేరకు ప్రతి దుకాణానికి మధ్య ఖాళీ స్థలాన్ని వదులుతున్నారు.

వేదిక మార్పు

తొలుత టపాసుల దుకాణాలను కడప నగరంలోని స్కాట్ హాలు మైదానం, బిల్టప్ వద్దగల ఈద్గా మైదానాలలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు దుకాణాల నిర్మాణం కూడా ప్రారంభించారు. కానీ స్కాట్ హాలు మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయడంపై ఆ ప్రాంతీయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నిజానికి అప్పటికి ఇంకా అధికారులు టపాసుల దుకాణాల ఏర్పాటు ప్రాంతాలపై తుది నిర్ణయం తీసుకోనట్లు తెలుస్తోంది. ఈలోపు అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అధికారులు స్కాట్ హాలు మైదానాన్ని రద్దు చేసి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుకు సముఖత వ్యక్తం చేశారు. దుకాణదారుల సంఘం ప్రతినిధులకు కూడా ఈ విషయాన్ని అధికారులు స్పష్టం చేశారు. దీంతో స్కాట్ హాలులో ఇప్పటికే ఏర్పాటు చేసిన దుకాణాలను హడావుడిగా తొలగించి బుధవారం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుకు దుకాణదారులు సిద్ధమయ్యారు.



బిల్టప్ మైదానంలో ఏర్పాటవుతున్న టపాసుల దుకాణాలు

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ దూరం

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : క్యాన్సర్ కారకాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే, ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో «మహిళల ఆరోగ్య సమస్యల నివారణ» అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ శరీరంలో ఉన్న కణాల అభివృద్ధిలో విపరీత పెరుగుదలే క్యాన్సర్‌కు కారకమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మొదటి, రెండవ స్టేజీలలో క్యాన్సర్ నయం కావడం సులువని, తర్వాత కష్టంగా మారుతుందన్నారు. శరీరంలో మార్పులు కనిపించగానే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడంలో వారధులుగా మారాలన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రముఖ జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డా. ఎం. పావని మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌కు గురయ్యే శరీరభాగాలు, వైద్యసౌకర్యాలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ డా. సుజాత మాట్లాడుతూ సంప్రదాయ జీవన విధానం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. అనంతరం నోబుల్ ప్రైజ్ విజేత మేరీ క్యూరీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను అతిథులు పరిశీలించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ డైరెక్టర్ డా. కె. లలిత, మైనార్టీ సెల్ డైరెక్టర్ డా. కె. రియాజున్నీసా, అధ్యాపకులు డా. సరిత, డా. మునికుమారి, డా. సురేష్‌బాబు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి శివరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్: విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అన్నారు. కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చెమ్ముమియాపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని హాస్టల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలను నడిపేటపుడు జాగ్రత్తగా వుండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్ లాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చక్కగా చదువు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప తాలూకా సీఐ రాజా, రక్షక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం కడపలోని పెన్షనర్ల కార్యాలయంలో నెలవారి ఈసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డిలు మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. అలాగే స్థానిక స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంకు మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొని తమ బ్యాంకులు పెన్షనర్లకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను తెలియచేశారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు బాలయల్లారెడ్డి, శంకరయ్య, రంగనాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నారెడ్డి

రాహుకాల పూజలు



కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

రేపటి నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్నా' కార్యక్రమం

వల్లూరు : మండల పరిధిలో గురువారం నుంచి మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 9 వ తేదీన లేబాక గ్రామ సచివాలయ పరిధిలో, 10న కొప్పోలు గ్రామ సచివాలయం, 14న దుగ్గాయపల్లె గ్రామ సచివాలయం, 15న దిగువపల్లె గ్రామ సచివాలయం, 16న కోట్లూరు గ్రామ సచివాలయం, 17న వల్లూరు గ్రామ సచివాలయం, 20న పైడికాలువ గ్రామ సచివాలయం, 21న తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయం, 22న తప్పెట్ల సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల మల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనువాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. పాలక మండలి సభ్యులు, భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

చెన్నూరు : మండలంలోని కనపర్తి లేఅవుట్లో నిర్మిస్తున్న జగనన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కనపర్తి లేఅవుట్లలో నిర్మించే జగనన్న గృహ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించిన హౌసింగ్ అధికారులు ఎప్పటికీ కప్పుడు రిపోర్టు తెప్పించుకుని పనులను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే ఆలస్యం అయిందని ఇకమీదట అలాంటి అలసత్వం లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. హౌసింగ్ డీఈ మాట్లాడుతూ ఇప్పటికే 670 పక్కా గృహాలలో 93 గృహాలకు స్లాబ్‌లు వేశారన్నారు. 352 గృహ నిర్మాణాలకు సంబంధించి స్లాబ్ లెవల్‌కు గోడలు వచ్చాయన్నారు. 218 ఇళ్లకు సంబంధించి బేస్ మట్టాలు పూర్తయ్యాయని ఇవన్నీ కూడా జనవరి ఫిబ్రవరి కల్లా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, హౌసింగ్ ఏఈ మేనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

కమలాపురం : పట్టణ పరిధిలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, ధ్వజ ప్రతిష్ట దాత ఆహ్వానం మేరకు హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాకను పురస్కరించుకుని ఆహ్వానితులు పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాలతో, పూర్ణ కుంభంతో, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువ కప్పి, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అయ్యప్ప మాల ధారణ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



ధ్వజ స్తంభం వద్ద హారతి ఇస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్లంమండివీధికి చెందిన సుల్తానా, ఖాదర్‌బాషాలకు 2016లో వివాహమైంది. ఇటీవలి కాలంలో భర్త తనను వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

– హనుమప్పవీధికి చెందిన తోట విజయలక్ష్మిని, పఠాన్ ఖలీద్ అనే వ్యక్తి ఆర్థిక లావాదేవీల విషయంలో బెదిరించడంతో పోలీసులను ఆశ్రయించింది, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

– విజయ్‌భట్ అనే పూజారిని ఇటీవల బెదిరించిన కేసులో చంద్రమౌళితో పాటు, అతని కుమారునిపై కేసు నమోదు చేశారు.

మద్యం తాగి ఆటో నడిపిన వ్యక్తికి నెల రోజుల జైలు

కడప అర్బన్: మద్యం సేవించి ఆటో నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వ్యక్తికి నెలరోజుల జైలు శిక్షతో పాటు, రూ.3 వేలు జరిమాన విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జెఎస్‌సీఎం కోర్టు తీర్పు చెప్పింది. గల్ల వీరాంజనేయులు (40) ఈనెల 3న మద్యం సేవించి ఆటో నడుపుతూ ఎర్రముక్కపల్లి వద్ద ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ అనలైజర్ తనిఖీలో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది.

వార్డెన్ భర్తపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఖాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హాస్టల్ వార్డెన్ భర్త సుధాకర్‌నాయక్‌పై పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, భర్తకు సహకరించిన వార్డెన్ మంగమ్మను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, నాయకులు వెంకటేష్, వంశీ, శివసాయి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాను కరువు కింద ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేశు, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జి.శ్రీరాములు మాట్లాడుతూ ఈ యేడు జిల్లా వ్యాప్తంగా వేసిన పంటలు వర్షాలు లేకపోవడంతో ఎండిపోయాయని పేర్కొన్నారు. తక్షణమే క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని మదింపు చేసినష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు జి.చంద్ర, సావంత్ సుధాకర్‌రావు, వెంకట శివ, అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



రిమ్స్‌లో నవజాత శిశు వార్డులో చిన్నారుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నారుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు శాంత, మనోహర్‌లు తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్ సూచనల మేరకు నగరంలోని కొండాయపల్లెలోగల శిశుగృహ, మోడల్ అంగన్వాడీ ప్రీ స్కూలు, రిమ్స్ ఆవరణలోని నవజాత శిశు వార్డులో శిశు రక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని, వారి ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు దశరథరామిరెడ్డి, దొరబాబు, శిశుగృహ మేనేజర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

శాకాహార ర్యాలీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పిరమిడ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో మంగళవారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. కడప పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీకి అనుబంధంగా ఉన్న మోచంపేట వశిష్ఠ విద్యామందిర్ హైస్కూలు విద్యార్థుల బృందం ఈ ర్యాలీ నిర్వహించింది. పిరమిడ్ సొసైటీ అధ్యక్షులు జీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ శాకాహారం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి, పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, పిరమిడ్ మాస్టర్లు మోచంపేటతోపాటు సమీపంలోని వీధుల్లో శాకాహారం అమృతాహారం అంటూ నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్య పరిచారు.

పెరుగుతున్న టమాట ధరలు



కడప అగ్రికల్చర్: టమాటాల ధర పెరుగుతోంది. కిలో రూ. 10 ఉన్న టమాట ధర రోజురోజుకు పెరుగుతూ రూ. 34కు చేరింది. నాలుగు రోజుల క్రితం కిలో రూ. 25 ఉండగా ప్రస్తుతం రైతు బజార్‌లో కిలో రూ. 34 చేరుకుంది. దీంతోపాటు అల్లం ధర కూడా పెరుగుతోంది. అల్లం కిలో ధర మొన్న మొన్న వరకు రూ. 120 ఉండగా ప్రస్తుతం అది కూడా కిలో రూ. 140కి చేరింది. ఉల్లిగడ్డలు కూడా కిలో రూ. 45 నుంచి 50 ధర పలుకుతోంది.

ఏబీవీపీ నగర కమిటీ ఏర్పాటు

వైవీయూ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కడప నగర నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శులుగా చరణ్, కార్తీక్, ఖాదర్‌లను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా హరి, సోషల్ మీడియా కన్వీనర్‌గా కార్తీక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వంశీ, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప రూరల్: రెవరెండ్ డాక్టర్ బిల్లీగ్రాహం శాంతి సందేశాలతో ప్రపంచ ఐక్యతను చాటిన మహనీయుడని రెవరెండ్ డాక్టర్ బిషప్ కే సామ్యూల్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని హోలీ జీసస్ క్రైస్ట్ జీసస్ చర్చిలో బిల్లీగ్రాహం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రత్నకుమార్, డేవిడ్‌రాజు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

10న తోలుబొమ్మలాట

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 10వ తేదీన తోలుబొమ్మలాట ప్రదర్శన నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా సాయంత్రం 6.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. ఇందులో భాగంగా తోలుబొమ్మలాట కళాకారులు సుందరకాండను ప్రదర్శిస్తారన్నారు. తోలుబొమ్మలాట ప్రదర్శనలో దేశ విదేశాల్లో ఖ్యాతి గడించి అవార్డులు, రివార్డులు పొందిన సత్యసాయి జిల్లా నిమ్మలకుంటకు చెందిన కళాకారులు ఈ ప్రదర్శన ఇస్తారని తెలిపారు.

అధిక ఫీజు వసూళ్లు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల ఫీజుపేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం రూ. 125 వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ జిల్లాలోని కడప, పొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ప్రాంతాలలోని కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల వద్ద నుంచి రూ. 5 వందల నుంచి వెయ్యి వరకు ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు యూసఫ్, సమీర్, సాధిక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : రక్తదాన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీ, జేబీవీఎస్ స్వచ్ఛంద సేవాసంస్థ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, రక్తదానం ద్వారా మాత్రమే ఆపదలో ఉన్నవారికి అందించవచ్చని తెలిపారు.

ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడారు. అనంతరం పలువురు యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డా. మహేష్, రెడ్‌క్రాస్ సొసైటీ అధికారి శంకర్‌రెడ్డి, సుధాకర్, ఎన్ వైకే అధికారి మణికంట, జేబీవీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు అశోక్, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ నాగరాజు, శివరామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.